కథ

# కాలజ్ఞానం

విహారి

## రాత్రి ఎనిమిదయింది.

## సుదర్శనం, చంద్రమౌళి చదరంగం ఆడుకుంటున్నారు.

### కాఫీ అందించి స్టూలు మీద కూచుంది పార్వతి, సుదర్శనం భార్య.

### 'వీడింకా రాలేదు' అన్నది వాకిలికేసి చూస్తూ. ఆ 'వాడు' కొడుకు విశ్వం!

**"వస్తాడు. వస్తాడు. వేట పూర్తి కావాలి కదా"- సుదర్శనం. ఎత్తు ఆలోచిస్తున్నాడు.**

**"అలా అనకు బావా. వాడి ప్రయత్నాలు వాడు చేస్తున్నాడు కదా" చంద్రమౌళి వోసారి తలెత్తి సుదర్శనం మొహంకేసి చూశాడు. అయన తన ఎత్తు మీదున్నాడు.**

"ఆ...ఆ... చేస్తున్నాడు. బిఎస్సీ అయి నాలుగేళ్లయింది. ఈ కోర్సనీ, ఆ కోర్సనీ ఓ వెయ్యి పార్లమెంట్ భవనాల్ని పంపించేశాడు. అన్నీ గాలిలో కలిసినై..." ఆగి చంద్రమౌళి ప్రశ్నార్థకపు చూపుల్ని అర్థం చేసుకుని చెప్పాడు "అదేనయ్యా- యాభై రూపాయల నోట్లు. అంటే యాభై వేలు".

చంద్రమౌళి నవ్వాడు.

"కొడుకంటే ఆయనకంతా వెటకారం, పరిహాసమేలే అన్నయ్యా" అని మూతి తిప్పుకుంటూ లోపలికి వెళ్లింది పార్వతి. క్రీగంట ఆమెను చూస్తూ బుంగమీసం సర్దుకున్నాడు, సుదర్శనం.

మాటల్లోనే వచ్చాడు విశ్వం. ఉదయం ఎనిమిదింటికి బయటికి వెళ్లినవాడు- ఇదే తిరిగి ఇల్లు చేరటం. నీళ్లు తాగి తన గదిలోకి వెళ్లబోతుంటే అడిగాడు చంద్రమౌళి, "ఏఁవోయ్, పండేమైనా అందిందా?" అని.

"జాబ్ మేళా అని నానా ఆర్భాటం. ఉదయం నుంచీ పెద్ద తిరణాళ. ప్రాణం పోయింది- వెయిట్ చెయ్యలేకా, తిరగలేకా. చివరికి రిజల్ట్ నిల్ మామయ్యా" అని లోపలికి వెళ్లిపోయాడు.

లోపలికి వెళ్తున్న కొడుకుని అదోలా చూస్తూ "నను బ్రోవమనీ చెప్పవే సీతమ్మ తల్లీ..." అని రాగయుక్తంగా పాడి, ఆపి, "వాడి సంగతేమోగానీ నాకుమాత్రం ఈ తిరగటాలూ, ప్రయత్నాలూ, షేక్స్‌పియర్ మొహంతో తిరిగిరావటం- అంతా చీదర చీదరగా ఉంది. రిటైరయి కూర్చున్నవాణ్ణి. ఎన్నాళ్లని ఈ బాధ్యతలూ, సంసార లంపటం. ఆ పిల్లకేమో ఏ సంబంధమూ కుదరటం లేదు. కురూపి కాకపోయినా అందం చాలటం లేదుట. ప్రతి వెధవకీ ఇలియానా కావాలనే కోరికే. పిల్ల నచ్చలేదు, నచ్చలేదు- అనే తీర్మానం", అంటూ ఆట వదిలేసి, విసుగ్గా చదరంగం బల్లనీ, బలాన్నీ పక్కకి తోసి, కుర్చీలో వెనక్కి వాలేడు సుదర్శనం.

వాతావరణం మారింది. ముసురు మొదలైంది!

చంద్రమౌళి కొంతసేపు పెళ్లిళ్ల మార్కెట్‌గురించి ఆ మాటా ఈ మాటా మాట్లాడి, 'వస్తాబావా' అంటూ సర్దుకున్నాడు.

పక్క వీధిలోనే ఆయన ఇల్లు. ఒక్క కొడుకూ, ఒక్కతే కూతురు. ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. పెళ్లిళ్లయిపోయినై. ఈయనా భార్యా అప్పుడే రెండుసార్లు యూయస్ పోయొచ్చారు.

సుదర్శనం కొద్దిసేపు తనలో తనే జాబ్ మార్కెట్ గురించీ, పెళ్లి కావలసిన కూతురు శ్రీలత గురించీ మాట్లాడుకున్నాడు. కొంతసేపు నిరుద్యోగి విశ్వం గురించి తనతో తానే ప్రత్యేకమైన డైలాగులు చెప్పుకున్నాడు. అవన్నీ అతని పనికిరానితనం గురించే సాగినై. కొద్దిసేపు దిక్కులు చూస్తూ చేతులాడించుకున్నాడు.


ఆరోజు దినపత్రిక మీద చూపు నిలిచింది. అందులో పడిన వార్త గుర్తుకొచ్చింది. వాడెవడో కంపెనీవాడు యాభైవేల ఉద్యోగాలు సిద్ధంగా వున్నై, ఇస్తాను- పనికొచ్చే అభ్యర్థుల్ని చూపమని సవాలు విసిరాడట. డిగ్రీలుంటై కానీ, ఉద్యోగానికి పనికొచ్చే చదువుండదని ఘోష పెట్టున్నాట్ట. చిత్రమైన సన్నివేశం! ఎవరు కారణం?

ప్రభుత్వం మీద, విద్యా విధానం మీద ఉక్రోషమొచ్చింది.

శత సహస్ర ఆలోచనలు, ప్రశ్నలు, సమాధానాలు... సీరియల్ సాగిపోయింది, బుర్రలో!

ఆక్రోశించి ఆక్రోశించి తన బీపీని తానే పెంచుకున్నాడు. తల తిరిగినట్లయింది. విషయం అర్థమైంది. లేచి మంచినీళ్లు తాగాడు. 'ఎక్కడేడ్చిందో ఈవిడ?' అని పరోక్షంలో భార్యని కసురుకున్నాడు.

అమ్మా కూతురూ వంటింట్లో ఏదో ముచ్చటలో ఉన్నారు.



కరెంటు పోయింది.

సుదర్శనం మొహం మీదా చీకటి ముసిరింది. గమ్మున కూచుండి పోయాడు.

పార్వతి కొవ్వొత్తి వెలిగించి తెచ్చింది. "వీడికి రోజూ ఇదొక ఆటయి పోయింది. గంటలు గంటలు తీసేస్తున్నాడు" అంటూ గదిలో నుంచీ హాల్లోకొచ్చింది శ్రీలత.

'వీడనగా' ఎవరు? లోలోపల సుదర్శనంకి ఏదో ప్రశ్న. 'కుంటి ప్రశ్నలు వేయకూడదు' అని బీపీ సర్దిచెప్పింది.

కరెంటు పోవటంతో ఇప్పుడా ప్రాంతమంతా జబ్బున పడిన రోగిలా మూలగసాగింది.

ఎక్కడో ఎవరివో ఏడుపులూ, పెడబొబ్బలూ వినిపిస్తున్నాయి. ఇతరత్రా- వివరం లేని శబ్దాల్నీ, మోతల్నీ, రొదనీ ప్రసారం చేస్తోంది చీకటి.

"వాడు బాత్‌రూమ్‌లో దూరేడేమో- క్యాండిలన్నా ఇవ్వమను" అన్నాడు సుదర్శనం- కూతుర్ని ఉద్దేశించి.


"అమ్మ వెళ్లిందిలే" అన్నది శ్రీలత.

కరెంటు వచ్చేసింది. లైట్లు వెలిగాయి.

"క్షణంలో జరిగేది తెలీదు. దైవాధీనం కరెంటు సప్లై" అంటూ లేచాడు సుదర్శనం.

- రాత్రి భోజనాల దగ్గర,

కొడుక్కి చెప్పుకొచ్చాడు సుదర్శనం, "ఇదివరలో నీకు చాలాసార్లు చెప్పాను. మళ్లీ చెప్తున్నా విను. ఉద్యోగం ఎండమావి. మనలాంటి వాళ్లకి అదొక బంగారులేడి. నేచెప్పిన మాట విని ఉద్యోగాల వేటనీ, సీవీలు అడ్డమైన నెట్‌లల్లో పెట్టటాలూ, ఎదురు చూపులూ అన్నీ బంద్ చెయ్యి. పోయి హాయిగా మీ ఫ్రెండ్స్ ఎక్కువగా వున్న పార్టీలో చేరు. ప్రజాసేవ! కావలసినంత కాలక్షేపం తిరిగే కాలుకీ పని. తినే నోటికీ ఇంత తిండీ, చేతిలోకి నాలుగు పైసలూ దొరుకుతాయి. ఇవ్వాళా రేపూ ఇదే బెస్ట్. కొంతమంది సూడో నీతిమంతులు తండ్రిగా నేను చెప్పేదాన్ని తప్పు పట్టవచ్చు. కానీ, ఒక్క వాస్తవం గుర్తు పెట్టుకో. యు కెన్ నాట్ బీ పర్‌ఫెక్ట్ ఇన్‌యాన్ ఇమ్‌పర్‌ఫెక్ట్ సిస్టమ్. మహామహులు దీన్ని చెప్పటం మానేసి వారి వారి రంగాల్లో ఆచరించేస్తున్నారు. నీకు నా సీరియస్ సలహా ఇది" అని టిఫిన్ చేయటం ముగించాడు.



విశ్వం ఏ భావమూ లేని చూపుతో అన్నం కెలుకుతున్నాడు. పార్వతి ఇద్దరినీ ఆశ్చర్యంతో చూస్తోంది. శ్రీలత తండ్రి సలహా గురించిన ఆలోచనల సుడిలో పడింది.

- ఏడాది గడిచింది.

విశ్వం ఇప్పుడు పార్టీ ముఖ్య కార్యకర్త.

రకరకాల ఆందోళనా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. అతని చొరవా, తెలివితేటలూ అతి త్వరలోనే అతన్ని ఛోటానాయకుణ్ణి చేసినై.

- ఇప్పుడు,

పార్టీ కార్యక్రమాలు పెద్దఎత్తున ఎగశాయి. అలజడి, ఆందోళన, రాస్తారోకోలు, ధర్నాలు, ఊరేగింపులు, కలెక్టరేట్ ముట్టడి... సాగుతున్నాయి. సమస్యలకేం కొదవ?

ఆరోజు,

కని చీకటివేళ. సుదర్శనం వసారాలో మంచం మీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. గోడవారగా కూచుని సన్నజాజి మాల కట్టుకుంటోంది శ్రీలత. పార్వతి లోపల ఏదో పనిలో వుంది.

చంద్రమౌళీ, ఆయన పక్కగా మరో నడివయస్సు వ్యక్తీ, కంగారుగా హడావిడిగా వచ్చారు. వాళ్ల మొహాల్లో ఆందోళనా, భయం.

వాళ్లని చూస్తూనే లేచి కూచున్నాడు సుదర్శనం. పార్వతీ అప్పుడే బయటికొచ్చింది.

వచ్చిన ఇద్దరూ నిలబడే వార్తని అందించారు. ఇవ్వాళ ధర్నా పెద్ద ఎత్తున జరిగింది. ముందే పోలీస్ బలగాలు భారీగా మోహరించి వున్నాయి. నినాదాలూ... ఘర్షణ... లాఠీఛార్జీ... బాష్పవాయు ప్రయోగం. అంతా రణరంగం దృశ్యం. తీవ్రంగా దెబ్బలు తగిలిన వారిని హాస్పటల్‌లో చేర్పించారు. వాళ్లల్లో విశ్వమూ ఉన్నాడు.

పరిస్థితి చాలా క్రిటికల్‌గా వుంది.

ఇదీ సారాంశం.

ఆదరా బాదరగా హాస్పటల్‌కి పరిగెత్తారు.

- జరిగిన దురంతానికి అక్షరాల రెక్కలూ, మాటల మోతలూ బాగానే అతికినై. పేపర్లూ, ఛానళ్లూ ఉత్సాహంగానే వార్తల్ని మోసినై.

పదిహేను రోజులకి ఇంటికొచ్చాడు విశ్వం.

చికిత్స తర్వాత విశ్రాంతిలో ఉన్నాడు. పరామర్శలకి వచ్చేవాళ్లు వస్తున్నారు, వెళ్లేవాళ్లు వెళ్తున్నారు. ఉచిత సలహాలూ బాగానే అందుతున్నై. కొందరు ఆరోగ్యం గురించీ, కొందరు భవిష్యత్ ప్రణాళిక గురించీ అమూల్యాభిప్రాయాలిచ్చి వెళ్తున్నారు.

ఒకరోజు, ఇంట్లోనే-

రాజకీయాల్లో ఇకముందు విశ్వం పాత్ర గురించిన చర్చ మొదలైంది. కుటుంబ సభ్యులతో పాటు, చంద్రమౌళీ, వాళ్లావిడా కూడా ఉన్నారు.

విశ్వం నిరుత్సాహంగా ఉన్నాడు. ముభావంగా ఉన్నాడు. అప్పుడో మాటా అప్పుడో మాటా మాట్లాడుతున్నాడు. అతని మాటల్లో నిర్వేదం. రాజకీయాలు చాలా నిరాశాజనకంగా ఉన్నాయని బాధగా వుందతనికి. అనుభవం అంత హాయిగా లేదు. కుహనా రాజకీయ నాయకుల పాత్ర గురించి తనకు తెలిసిన విషయాలు వర్ణిస్తున్నాడు. "నా ఆరోగ్యానికి ఇవి పడవేమో" అన్నాడు.

అంతా విని సుదర్శనం అన్నాడు, "ఇంత మాత్రానికే మనస్సు శిథిలం కాకూడదు. జీవితంలో ఏ వృత్తిలోనైనా ఎత్తుపల్లాలూ, తుపానులూ, ఉప్పెనలూ తప్పవు. అందులోనూ నువ్ దిగింది రాజకీయాల్లోకి. కొన్ని కొన్ని సంభవాలకి దళసరి చర్మం కావాలి. అసలు నీకో రహస్యం చెప్తా విను" ఆగి చుట్టూ చూశాడు. అందరూ ఉత్సుకతతో వింటున్నారు.

తన మాటలు కొనసాగించాడు సుదర్శనం, "ఇప్పట్నుంచీ నీకసలు కళ్లూ, ముక్కూ, చెవులూ ఉన్నట్లు మరచిపోవాలి నువ్వు. అప్పుడు అన్ని సమస్యలూ వాటంతటవే తీరిపోతాయి. బెస్టాఫ్ లక్".

అందరూ సుదర్శనం వైపు అవాక్కయి చూస్తున్నారు.

గాలి రివ్వున కొట్టోంది. విశ్వంకేమో కళ్లముందు-

మూగ, గుడ్డి భూతమేదో వికృతంగా నవ్వుతోంది!

భయమేసింది. కళ్లు గట్టిగా మూసుకున్నాడు. ఇదా ప్రజాసేవ?

ఎక్కడి నుంచో పాట వినవస్తోంది, 'ఏ నిముషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ...'!!

విశ్వం అధోచేతనలో ప్రశ్న 'ఇక్కడి నుంచీ... ఎక్కడికి?' •